“యూ ఆర్ కరెక్ట్ బేబీ! ఈ యుద్ధంలో నెత్తురు చిందదు.  ఈబిజినెస్ వార్ కరెన్సీ కోసం కాదు. కక్ష కోసం.”

“ఎవరితో .......?” వెంటనే అడిగింది నిశాంత.

జవాబు చెప్పలేదు దేశ్‌ముఖ్.

“మీ బిజినెస్ వార్‌లో నేనేం చెయ్యాలి? నా పాత్ర ఏమిటి?” దేశ్‌ముఖ్ అంతరంగాన్ని అంచనా వేయడానికి ప్రయత్నిస్తూ అడిగింది నిశాంత.

“ఇది యుద్ధం.......కానీ ఈ యుద్ధంలో నీ పాత్ర......లవర్ పాత్ర.  అంటే ప్రేమించడం” రూమ్ ఒక పక్క మండుతున్న ఫైర్ బాక్స్ వైపు చూస్తూ అన్నాడు ఆయన.

“ప్రేమించాలా?” ఆశ్చర్యంగా అడిగింది నిశాంత.

“దిసీజ్ నాట్ అర్డనరీ లవ్.  డెడ్‌లీ..........డేంజరస్ ..........లవ్.........లవ్‌గేమ్.”

“దేశ్‌ముఖ్ తెల్లటి జుత్తు, షాండెలియర్ వెలుగులో వింతగా మెరుస్తోంది.

“నేనెవర్ని ప్రేమించాలి?” ఆ ప్రశ్నకు వెంటనే జవాబు చెప్పలేదు.  దేశ్‌ముఖ్.

“ఇప్పుడు కాదు........ఆ గేమ్ గురించి నేనప్పుడు చెప్పను.  ఆపరేషన్ ప్రారంభం కావడానికి క్షణాల ముందు మాత్రమే చెప్తాను.  ఈ లోపల నువ్వు కొన్ని విషయాల గురించి తెల్సుకోవడం చాలా అవసరం.  ముఖ్యంగా హ్యూమన్  సైకాలజీ, మార్షల్ ఆర్ట్స్, రైఫిల్ షూటింగ్ కంప్యూటర్ ఆపరేషన్స్” చెప్పుకుపోతున్నాడు దేశ్‌ముఖ్.

“వీటన్నిటికీ ముందు నేనవర్ని ప్రేమించాలో నాకు తెలియడం చాలా  అవసరం.”

“సీరియస్ ప్రేమించడం కాదు.  ప్రేమిస్తున్నట్టుగా నటించాలి అందుకు” ఏదో చెప్పబోయాడు అయన.

“ఎందుకైనా నేను తెల్సుకోవాలి........” దృఢ నిశ్చయంతో అంది నిశాంత.

“తెల్సుకుంటే షాక్ తింటావు.  చెప్పు పెట్టకుండా వెనక్కి వెళ్ళి పోతావు” డోర్‌కర్టెన్ తీసి, బయట లాన్ వైపు చూస్తూ అన్నాడు దేశ్‌ముఖ్.

“అంత పిరికిదాన్ని కాను.”

కొన్ని నిమిషాల తర్వాత చెప్పడానికే నిర్ణయించుకున్నాడు ఆయన.

“నువ్వు ప్రేమించినట్టుగా నటించాల్సింది.  నీ అందచందాలతో వశపరచుకోవాల్సింది, నీమాటల మత్తులో ఉక్కిరి బిక్కిరి చేయాల్సిందీ, నీ చేతలతో అష్టదిగ్బంధనం చేయాల్సిందీ సిద్ధార్థను” మహా సర్పయాగానికి ఉపక్రమిస్తున్న వాడిలా వున్నాడు దేశ్‌ముఖ్.

“సిద్ధార్థ?” ఆ మాటను వినగానే ఆశ్చర్యపోయింది నిశాంత.

“ఎవరా సిద్ధార్థ........మీ శత్రువు కొడుకా?” సూటిగా అడిగింది నిశాంత.

దీర్ఘంగా నిట్టూర్చాడు ఆయన.

“అతను మహంత కొడుకు. గ్రేట్ వెపన్స్ డీలర్ మహంత ఏకైక పుత్రరత్నం

అద్దాలమేడలో అపురూపంగా  పెరుగుతున్న బంగారు.  పక్షి సిద్ధార్థ మహంత వ్యాపార ప్రపంచానికి కావలసిన యువరాజు. అతను నీ ప్రేమ వలలో పడి గిలగిల్లాడి పోవాలి. విలవిల్లాడిపోవాలి.  వాడెందుకూ పనికిరాకుండా పోవాలి.  ఆ అద్దాలమేడను నువ్వు ధ్వంసం చెయ్యగలవా?" పొంగుతున్న ఆవేశాన్ని, ఎగజిమ్ముతున్న క్రోధాన్ని అణచుకుంటూ అగాడు ఆయన.

విలక్షమైన ఆయనను చూస్తోంది నిశాంత.  ఆయనలోని కసి నిశాంత ఎదుట బయటపడడం అదే మొదటిసారి.

"మీలో యింత దుర్మార్గం వుందని నేననుకోలేదు" సూటిగా కళ్ళల్లోకి చూస్తూ అంది నిశాంత.

"దుర్మార్గం ఏది దుర్మార్గం? దుర్మార్గానికి డెఫినేషన్ చెప్పగలవా నువ్వు?" ఆయన స్వరంలో మార్పుని గమనించలేదు నిశాంత.

"మహంత మీది పగతో, అతని కొడుకుని నాశనం చెయ్యాలను కోవడం దుర్మార్గం. అది దుర్మార్గం కూడా కాదు, నైచ్యం మీ నైచ్యంలో నన్ను చేతులు కలపమనడం, మరింత నైచ్యం ఇదేనా డెడ్లీ డేంజరస్ గేమ్? ఆయామ్ సారీ దేశ్‌ముఖ్.......దీనికన్నా నేను అచ్యుతముని దగ్గర రెడ్‌లైట్ ఏరియాలో, నా వళ్ళమ్ముకుని బతకడం వుత్తమం....."నిశాంత గొంతులోంచి పదునుగా వచ్చాయి ఆ మాటలు.

"నిశాంతా! నీకు అనుభవం తక్కువ.......నీ ఆలోచనా పరిధి కూడా తక్కువ.  డోన్ట్ ఆండ్ ఎస్టిమేట్ మీ.......నేన్నేం చేసినా, ఒక పర్సన్‌కోసం చేస్తాను.  ముందు ముందు నీకే అర్థమౌతుంది....." సాధ్యమైనంత నెమ్మదిగా అన్నాడు ఆయన.

"ఎంటి నాకర్థమయ్యేది? ఒక  మనిషి మనసుతో, మీ వ్యాపారస్తులు ఆట్లాడుకోవచ్చు. కానీ  నేనాడలేను......." నిక్కచ్చిగా చెప్పింది నిశాంత.

"మనసు .......ఆట.........వేలెడంత లేవు.   నీకెంత మనసుందేవిటి?  చెప్పు నీ మనసు ఖరీదెంతో చెప్పు కోటి రూపాయాలా? రెండు కోట్లా?" ఆయన వ్యంగ్యాన్ని భరించలేకపోతోంది నిశాంత.

"డబ్బుతో ప్రపంచాన్ని కొనాలనుకోవడం మీ భ్రమ........." పౌరుషంగా అంది నిశాంత.

"ఓల్డ్ స్లోగన్.......డోంట్ రిపీట్ యిట్......నువ్వు అచ్యుతముని దగ్గర్నించి, నా దగ్గరకొచ్చింది డబ్బుకోసం కాదా? చేతులు మారింది డబ్బు కోసం కాదా?" ఆవేశంగా ప్రశ్నించాడు ఆయన.

"అవును. డబ్బు కోసమే నేను నటించి డబ్బు సంపాదించాలనుకోవడం లేదు నేను

పాచికగా మారమంటున్నారు. అది నాకిష్టం లేదు. ఎవర్నో, ఎందుకో ప్రేమిస్తున్నట్టుగా నటించడం, మీరు సాగించే నెత్తురు కారని బిజినెస్ వార్‌లో నేనందుకు వారధి కావాలి? మీ కక్షకు నేనందుకు కొరడాను కావాలి చెప్పండి?" సూటిగా అమాయకంగా అడుగుతున్న నిశాంత ముఖంలోకి జాలిగా చూశాడు ఆయన.

"ప్రపంచంలో మంచి తప్ప, చెడు నీకింకా పూర్తిగా తెలీదు. ప్రపంచంలో దయ తప్ప, కన్నీళ్ళు నీకింకా తెలీదు. ప్రపంచంలో జాలి, మానవత్వం పదిలంగా వున్నాయని నువ్వు నమ్ముతున్నావే. ఆ రెండింటికి విలువ లేదని, ఆ రెండూ అందమైన మాటలని మాత్రమే నేను నమ్ముతున్నాను బ్రతుకులోనూ, వ్యాపారంలోనూ దుర్మార్గం తప్ప, నైచ్యం మహాపాపం. అని చిత్తశుద్ధిగా నమ్మిన నేను, ఆ రెంటీని ఆశ్రయించడానికి కారాణమేమిటో తెలుసా?"

ఆయన మనసులో చల్లారిన అగ్నిగుండం వుందని నిశాంత తెలీదు. తను నమ్మిన మానవత్వం అదును చూసి, ఆయనను కాటు వేసిందని నిశాంతకు తెలీదు. అభిమానం, స్నేహం, ప్రేమ ఆయన జీవితంలో పరిహాస పదాలుగా మాత్రమే మిగిలాయని నిశాంతకు తెలీదు.

గబగబా ముందుకొచ్చి, నిశాంత కుడి చెయ్యిని పట్టుకున్నాడు దేశ్‌ముఖ్.

"కమాన్ విత్ మీ......." ఆ గొంతు గరుగ్గా వుంది. ఆ ఏ.సి సూట్లోంచి బయటికొచ్చాడు ఆయన.

లిఫ్ట్‌లోంచి కిందకు దిగి, కారువేపు నడిచాడు.

అనూహ్యంగా, ఆ సమయంలో కిందకు వచ్చిన దేశ్‌ముఖ్‌నుచూసి, లాంజ్‌లో వున్న సెక్యూరిటీ స్టాఫ్ పరుగు పరుగు ముందుకెళ్ళారు.

వాళ్ళను రావద్దన్నట్లు సంజ్ఞచేసి, కారెక్కాడు ఆయన. డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. పక్కన కూర్చుంది నిశాంత.

కారుని స్వయంగా ఆయనే డ్రైవ్ చేస్తున్నాడు.

* * * * * * * *

సరిగ్గా నలభై నిమిషాలు గడిచాయి.

బొంబాయి, నాగపూర్‌కి నేషనల్ హైవేకి, రెండు కిలోమీటర్ల లోపల వుందా భవనం.

ఆ భవనం ముందు కారాగింది.

దేశ్‌ముఖ్ చూడగానే గేట్‌మెన్ వినయంగా తలుపు తెరిచాడు. కారు లోనికి ప్రవేశించింది.

గేటుకి ఎడం పక్కనున్న బోర్డువైపు చూసింది నిశాంత.

మదర్ థెరిస్సా చారిటబుల్ డఫ్ వైపు స్కూల్. ఆయన తననిక్కడకెందుకు తీసుకొచ్చాడో అనూహ్యంగా వుంది నిశాంతకు.

ఆయన కారు దిగి లోనికి వడివడిగా నడుస్తున్నాడు. ఆయన వచ్చాడన్న వార్త క్షణాల్లో తెలియడంతో ఎదురు దిమ్ముతో స్కూలు ప్రిన్సిపాల్, వార్డెన్ ఇద్దరూ పరుగున వచ్చి స్వాగతం

పలికారు.

ఆయన ఎందుకొచ్చాడో వాళ్ళకు తెలుసు.

ఒక పక్క ఎర్రరాతి స్కూల్ బిల్డింగ్, మరో పక్క హాస్టల్ భవనాలు ఆ భవనాలవైపు నడుస్తున్నారందరూ.

"నా వాళ్ళతో నేను ఏకాంతంగా వుండాలని కోరుకుంటున్నాను మేడమ్."

ఆయన మాటకు ప్రిన్సిపాల్, వార్డ్ స్థాణువుల్లా నిలబడి పోయారు.

ఆ భవనంలోని విశాలమైన పోర్షన్‌లోకి ప్రవేశించాడు ఆయన.

ఆ స్పెషల్ పోర్షన్‌లోకి అడుగుపెట్టిన ఆయన కళ్ళు నలువైపులా చూస్తున్నాయి.

"డాడీ" పిలుపుతో పాటు, అడుగుల శబ్దం కూడా ఒకేసారి వినబడింది.

రూమ్‌లోంచి బయటి కొస్తూ ఇద్దరమ్మాయిలు పాలరాతి శిల్పాలకు బంగారు పూత పూసినట్లుగా వున్నారు.

ఇద్దరూ కవలపిల్లలు. నిశాంత వయసే వుంటుంది. వాళ్ళకు. ఇద్దరూ పరుగు పరుగున వచ్చి ఆయన గుండెలమీద వాలిపోయారు.

ఆయన నిశాంత వైపు చూశాడు తడిదేరిన కళ్ళతో.

"వీళ్ళిద్దరూ.........గ్రేట్ ఇండస్ట్రియిలిస్టు ఈ దేశ్‌ముఖ్ పిల్లలు.......ట్విన్స్......ఇది మూగపిల్ల......ఇది చెవిటిపిల్ల......కోటానుకోట్లనా ఆస్తికి వారసులు వీళ్ళు........కానీ వీళ్ళ పరిస్థితి చూశావా......నా మనసులో నిరంతరం బడబాగ్నిలా రగిలే బాధకు కారణం నా పిల్లలు. ఇది దేవుడు పెట్టిన శాపమా? సైన్స్ మిగిల్చిన పాపమా? కాదు.........నా డబ్బు, నా హోదా,నా తెలివితేటలు ఇవేవీ నా పిల్లలకు పనికిరాకుండా పోయాయి. ప్రపంచంలోని ప్రతి స్పెషలిస్టూ నా పిల్లల్ని చూశారు. పెదవి విరిచేశారు."

తనను తాను కంట్రోల్ చేసుకుంటూ బాధను దిగమింగుతున్న ఆయనలో మొట్టమొదటిసారి ఒక తండ్రిని చూసింది నిశాంత.

ఆశ్చర్యంగా ఆ అమ్మాయిలవైపు చూసింది.

"ఏ ప్రేమ జాలి, దయ, అభిమానాల్ని నేను నమ్మానో, నమ్మకం చేసిన, వంచన మిగిల్చిన పిల్లలు వీళ్లు."

ఆ పిల్లలిద్దరితో కాసేపు గడిపి కళ్ళనీళ్ళతో వెనక్కి వచ్చాడు ఆయన.

నిశాంతకు ఆ దృశ్యం అనూహ్యంగా వుంది.

ఆయనలాంటి వ్యక్తుల జీవితంలో అంతటి విషాదం వుంటుందని ఆమె ఎప్పుడూ వూహించలేదు.

ఏకైక నేస్తం వంటరితనం.

కాలాన్ని శాసించగలిగే తండ్రి కడుపున పుట్టిన కన్నీటి బిందువులు.

అప్రయత్నంగా నిశాంత కనుకొలకుల్లో రెండు కన్నీటిచుక్కలు కదలాడాయి.

"దుర్మార్గం, నైచ్యం, డెడ్‌లీ డేంజర్ గేమ్ ........మానవ మారణ హోమం.......నువ్వు ఏ పేరైనా పెట్టుకో! పద్దెనిమిదేళ్ళుగా నాలో పెరుగుతున్న కక్ష, కసి.....నాలోని మనసుని చంపేసిన నయవంచన. ఆ నయవంచన పేరు మహంత."

నిశ్శబ్దంగా చీకటి దారిలో వెళ్తోంది కారు. నగర శివార్లలోంచి బొంబాయి. విద్యుద్దీపాల వెలుగులో, వింతగా వెలుగులు విరజిమ్ముతోంది.

"మహంత మీకు ద్రోహం చేశాడా?" నెమ్మదిగా అడిగింది నిశాంట.

"అవును......నమ్మకద్రోహం చేశాడు. ఇరవైఏళ్ళ క్రితం మహంత రోడ్డు సైడు హోటల్లో స్టీవార్డుగా పనిచేసేవాడు. మొదటి చూపులోనే నన్ను ఆకర్షించాడు. తీసికొచ్చాను. అప్పుడే నేను స్టార్ చేస్తున్న చిట్‌ఫండ్ బిజినెస్‌లో పార్టనర్‌ని చేశాను ఇంటింటికీ సైకిళ్ళ మీద తిరిగిన రోజుల్ని నెన్నప్పటికి మరిచిపోలేను. సిరిగ్గా రెండేళ్ళు గడిచాయి. నానుండి విడిపోయాడు మహంత. నేను బాధపడలేదు.

నా చిట్‌ఫండ్ కంపెనీలో పార్టనర్స్‌ని తనవైపు తిప్పుకున్ని స్పిన్నింగ్ మిల్ పెట్టాడు. నేను ఏకాకిగా ఈదడం మొదలెట్టాను. కానీ మహంత కన్నింగ్‌నెస్‌లోని మొట్టమొదటిసారి తెలుసుకున్నాను. ఆ కన్నింగ్‌నెస్ అతను పెట్టుకున్న పేరు, టైమ్ అండ్ లక్.

సరిగ్గా మహంత కొత్త బిజినెస్ ప్రారంభించిన రోజుల్లోనే నా రెండో భార్య ప్రసవించింది ట్విన్స్ పుట్టారు వాళ్ళిద్దరూ ఒకర్నొకరు అతుక్కుని పుట్టారు. పుట్టిన ఆరుగంటల్లోనే ఆపరేషన్ చెయ్యాలన్నాడు డాక్టర్.

ఆపరేషన్ ఖర్చు లక్ష రూపాయలు.

అప్పటికే చిట్‌ఫండ్ కంపెనీ గొడవల్లో వుంది. పార్టనర్స్ గొడవలు ఆ గొడవలకు కారణం మహంత.

నాకు లక్ష రూపాయలు కావాలి. నా బిజినెస్ కోసం కాదు నా పిల్లల్ని బ్రతికించుకోవడం నా మనసుని చంపుకుని వెళ్ళాను. జరిగిందేమిటో తెలుసా నిశాంతా?"

ఆ నాటి సంఘటన జ్ఞాపకం రావడంతో వణికిపోతున్నాడు ఆయన.

స్టీరింగ్ మీదున్న అతని చేతులు పట్టుతప్పుతున్నాయి. సడన్‌గా కారుకి బ్రేక్ వేసేశాడు. రోడ్డుపక్కన ఆగిపోయింది కారు.

"సిక్స్..........సిక్స్ అవర్స్......నాపిల్లల ప్రాణాలతో మహంత అడుకున్నాడు. నా మంచితనంతో, నా సహనంతో మహంత అడుకున్నాడు. ఆ మంచితనం విలువ ఆరుగంటలు.

ఆరు గంటలలోపు ఆపరేషన్ జరిగితేనేకాని, బ్రతకని పిల్లలు ఒక పక్క........

అదే ఆరు గంటలసేపు మహంత కోసం వెతుకుతూ నేను పిచ్చి వాడిలా తిరిగాను.

మీరడిగితే నేను.......నా ప్రాణాలైనా యిస్తానని నాతో చెప్పి ఒక్క అరగంటలో మీకు ఎడ్జస్టు చేస్తానని మహంత ఆ ఆరుగంటలసేపు నన్ను తప్పించుకుని తిరిగాడు.

మొట్టమొదటిసారిగా నా సహనం కన్నీరు కార్చిన క్షణాలివి. నాలోని మానవత్వం మూగగా ఏడ్చిన క్షణాలివి.

నాకు డబ్బివ్వడం యిష్టంలేక మహంత నన్ను తప్పించుకు తిరుగుతున్నాడని తెలుసుకోవడానికి నాకు పట్టినకాలం ఆరుగంటలు. పిచ్చివాడిలా మహంత ఇంటికి, ఆఫీసుకి తిరిగాను.

అప్పటికే ఆలస్యమైపోయింది.

నిరాశగా హాస్పిటల్‌కి చేరిన నాకు తెలిసిన మొట్టమొదటి షాకింగ్ న్యూస్.

నా భార్య నా కోసం ఎదురుచూసి, ఎదురుచూసి చనిపోయిందని.

నా మీద అభిమానంతో, ప్రేమతో డాక్టర్లు ఆపరేషన్ చేసి, కవల పిల్లల్ని విడదీసారని.

ఒక వైపు దు:ఖం, రెండోవైపు ఆ దు:ఖాన్ని దిగమింగడానికి ఓదార్పునిచ్చే సంతోషం.

ఆ సంతోషం కూడా నాకెక్కువసేపు మిగల్లేదు.

అనుకున్న సమయంలో ఆపరేషన్ జరగపోవడంవల్ల నా ఇద్దరు పిల్లల్లో ఏదో లోపం ఏర్పడటానికి ఆస్కారముందని డాక్టర్లు చెప్పడం.

డాక్టర్లు ఊహ అసత్యం కాలేదు.

నా పిల్లలిద్దరికీ ఒకరికి మూగతనం, ఒకరికి చెవిటితనం.

సెన్స్‌కి అందని విచిత్రం తెలుసా......నిశాంత.......నా పిల్లలిద్దరి బ్రెయిన్స్‌లో ఎక్కడా ఏ లోపం లేదు.

నా పిల్లలిద్దరూ మామూలు మనుషులు కావాలంటే వాళ్ళకోసం నేను డబ్బు సంపాదించాలి. బిజినెస్‌ని కావాలి. నా బిజినెస్ సక్సెస్‌కి నా పిల్లలే పునాదులు.

నాడ్రీమ్‌ను నిజం చేసుకున్నాను కరోర్‌పతిని కాగలిగాను.........కానీ నా పిల్లల అంగవైకల్యాన్ని పోగొట్టలేకపోయాను.

అంగవైకల్యం కన్నా, మనోవైకల్యం చాలా ప్రమాదకరమైంది...

అందుకే ......అందుకే......

మహంతను దెబ్బతియ్యడానికి ఇనేళ్ళు ఓపిక పట్టాను. దిసీజ్ కరెక్ట్ టైమ్ ఫర్ టు టేక్ రివెంజ్.

ఇది పగ, దుర్మార్గం..........ఇన్‌హ్యూమన్ అని ఇప్పటికీ నువ్వనుకుంటే.....నీదారిన

నువ్వెళ్ళొచ్చు" కారు స్టార్ట్ చేశాడాయన

కారు బొంబాయి సిటీలోకి ప్రవేశించడానికి ఇరవై నిమిషాలు పట్టింది.

నిశాంత దేశ్‌ముఖ్‌లోని ఆవేదనను అర్థం చేసుకోడానిక ప్రయత్నిస్తోంది.

* * * * * * * * * * * * *

హోటల్ తాజ్ ఇంటర్ కాంటినెంటల్.

స్పెషల్ డైనింగ్ హాల్లో ఇద్దరే కూర్చున్నారు. ఆ ఇద్దరూ దేశ్‌ముఖ్, నిశాంత.

"నేను మీరు చెప్పింది చేయడానికి సిద్ధంగా వున్నాను. మీ ముందు నాకున్న తప్పుడు అంచనాలన్నీ తొలగిపోయాయి. మీరివెంజ్ నేను తీర్చుకుంటాను" నిస్సంకోచంగా అందినిశాంత.

ఆమె కళ్ళ ముందు దేశ్‌ముఖ్ కుమార్తెలే కదలాడుతున్నారు.

"ఈ ఆపరేషన్‌కి నీకెంత కావాలో చెప్పు" క్యాజువల్‌గా అడిగాడాయన.

ఆయన మనస్తత్వాన్ని కొంతలో కాంత అర్థం చేసుకున్న నిశాంత ఒక్క క్షణం కళ్ళు మూసుకుంది. ఆమెకు చటుక్కున చిన్నప్పుడు తమ ఊళ్ళో సుబ్బారెడ్డి మాస్టారు చెప్పిన కథ జ్ఞాపకానికొచ్చింది.

"మీ ఆస్తి ఎంత?" అడిగిందామె.

చెప్పాడాయన.

"అయితే నాకో అయిదుకోట్లు కావాలి" సిగ్గుపడుతూ అడిగింది ఆమె.

"నా పాతిక వేల కోట్ల ఆస్తిలో సగం అడుగుతావనుకున్నాను. పూర్‌గర్ల్. అయిదు కోట్లు ఇచ్చాననుకో.. ఏం చేసుకుంటావ్? స్వంతంగా బిజినెస్ స్టార్ట్ చేస్తావా?"

"కాదు"

"మరి?"

ఒక్క క్షణం తటపటాయించింది నిశాంత.

చెప్పడం ప్రారంభించింది.

"కరువుతో విలవిల్లాడిపోతున్న మా ఊరుని బాగుచేస్తాను. ఆకలితో చచ్చిపోయిన రాయలసీమలోని మా గంగిరెడ్డిపల్లి గ్రామంలో వెయ్యి గడపల ఇళ్ళను పెంకుటిళ్ళుగా చేస్తాను. ప్రతి కుటుంబానికో రెండు గేదెల్నికొనిస్తాను.